بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نحمدہٗ ونصلی علیٰ رسولہ الکریم وعلیٰ عبدہ المسیح الموعود

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 14.10.2016 (Telugu)**

**అల్లాహ్ తఆలా దుష్టమైనదని చెప్పిన ప్రతి విషయము నుండి దూరముండుము. అల్లాహ్ తఆలా చేయాలని ఆదేశించిన ప్రతి విషయమును పాటించుము. ధార్మిక సేవకు అల్లాహ్ తఆలా అనుగ్రహించినచో దానిని దైవ శుభముగా భావించుము. పదవిదారులందరు, సేవకులు కూడ నిష్టాపరతను అవలంభించుచు తమ విధులను నిర్వర్తించుటకు కృషి చేయవలెను. సభలో వినిన విషయములను మనము ఇప్పటి వరకు ఆచరించినామా ? జీవిత భాగములుగా చేసుకున్నామా ? అని సభలో పాల్గొన్నవారందరు ఆత్మ పరిశీలన చేసుకోవలెను. ఎలా మనము సత్కార్యములను సదా అవలంభించవలెను, ఇందుకు ఎలా కృషి చేయవలెనో కూడ పరిశీలించుకోవలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 14.10.2016 తేదీన కెనడాలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

అల్లాహ్ తఆలా కృపానుసారము జల్స సాలానా (వార్షిక సభ) కెనడా గత వారము ముగిసినది. అల్లాహ్ తఆలా శుభములను బహిర్గతపరచుచు ముగిసినది. ఇందుకు మనము అల్లాహ్ తఆలాకు ఎన్ని కృతజ్ఞతలు తెలిపినా తక్కువే అగును. చాలా పరిమితమైన వనరులున్నను ప్రతి చోట మనము సభలు నిర్విహించుచున్నమంటే ఇది అల్లాహ్ తఆలా శుభమే. కేవలం అల్లాహ్ తఆలా ప్రత్యేక శుభముతోనే సాధారణంగా ఏర్పాట్లు కూడ మంచిగా జరుగుచున్నవి.

ఈ మూడు రోజులలో ప్రత్యేకంగా డ్యూటీ చేసేవారి మెదడులో ఇహలోక భావన పూర్తిగా మాయమైపోవును. తమను తాము ప్రవేశపెట్టిన వారికి కేవలం సభ, నిస్వార్ధముగా మాత్రమే సేవచేయాలనే ఆలోచన యుండును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల సేవ కొరకు అన్ని ఆలోచనలను మించి ప్రతి కోరికను వీడి, తమను తాము ప్రవేశపెట్టి సేవ చేయాలనే ఉత్సాహము ఈ సేవకులందరి హృదయములలో కల్పించువాడు అల్లాహ్‌యే. అల్లాహ్ తఆలా ప్రీతి కొరకు మాత్రమే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల సేవ చేయాలనే ఆలోచన యుండవలెను.

కనుక చదువుకున్న వారైనను నిస్వార్ధముగా సేవ చేయువారిని జమాఅత్‌నకు అందించిన అల్లాహ్ తఆలాకు మనము మొదటగా కృతజ్ఞతలు తెలుపవలెను. మరుగుదొడ్లను శుభ్రము చేయాలని వారికి చెప్పినచో చేస్తారు. అన్నము వండాలని చెప్పినా వండుతారు. అన్నము వడ్డించాలని చెప్పినా వడ్డించుతారు. చెప్పినచో సెక్యూరిటి డ్యూటీలు ఇస్తారు, పార్కింగ్ డ్యూటీలు ఇస్తారు. ఈ విధముగా వివిధ శాఖలలో డ్యూటీలు చేస్తారు. పిల్లలు సభాప్రాంగణములో మౌనము, ఉత్సాహముతో అతిథులకు నీళ్ల త్రాగించినప్పుడు ఇతర అతిథులు ప్రభావితము కాక యుండలేరు. ఈ పిల్లలలో సేవా దృక్పథము మీరెలా కల్పించినారని ఆశ్చర్యముతో ప్రశ్నించుతారు.

కనుక సభలో పాల్గొనువారు ఈ సేవకులకు కూడ కృతజ్ఞతలు తెలుపవలెను. సభా ఏర్పాట్ల కొరకు చాలా మంది సభ కంటే ముందు, తరువాత కూడ పనులు చేస్తారు. కొందరు అతిథులు నన్ను కూడ కలిసినారు. సభ డ్యూటీల వలన సెలవు దొరకనందున తమ ఉద్యోగములను కూడ విడిచిపెట్టినామని వారు తెలిపిరి. వీరు తమ నిద్రను గాని విశ్రాంతిని గాని లెక్క చేయరు. స్వచ్ఛందంగా తమను తాము ప్రవేశపెట్టి సేవా దృకపథముతో అతి చిన్న చిన్న పనిని కూడ ఎంతో ఆనందము, బాధ్యతతో నిర్వర్తించిన సేవకులందరికి, పిల్లలకి, అతిథులకు, బాల

బాలికలకు, స్త్రీలకు, పురుషులకు ముందుగా నేను కృతజ్ఞతలు తెలుపుచున్నాను. వాస్తవానికి ఈ కార్యము ఒక మౌన ప్రచారము. బాహ్యరూపంలో వీరు పని చేయుచు కనిపింతురు కాని వచ్చిన ఇతరులకు వీరు ప్రచారానికి కారకులై అనేకుల మార్గదర్శనము కొరకు కారణమగుదురు. బంగాలీయుడైన ఒక అహ్మదియేతర మిత్రుడు అమెరికా నుండి బంగాలీ అహ్మదీయులతో కలిసి వచ్చిరి. వారి పేరు షహీదుర్రహ్మాన్. వారిట్లనిరి. సభ చూడగానే నేను ఇస్లాం వైపు తిరిగివచ్చినాను. సభ నాపై తీవ్రమైన ప్రభావము వేసినది. త్వరగా నేను జమాఅత్‌లో చేరుతానని భేటి అయినప్పుడు వారు నాతో అనిరి. ఈ విధముగా సభతో ప్రచారము కూడ జరుగును.

పార్లమెంట్ సభ్యులైన డీప్‌షోల్డె నుండి వచ్చిన ఒక అతిథి ఇట్లనిరి. ప్రతి సారి ప్రకారము నేను ఈ సారి కూడ చాలా ప్రభావితమైనాను. సభ సమయమున ఎంత మంది సేవకులు కనిపింతురనగా వీరు సభను గట్టి ఏర్పాట్లతో నడిపింతురు. సేవకుల నిరంతర కృషి ఫలితముగానే సభ క్రమశిక్షణతో జరుగుచున్నది. ఈ సేవకులు ఎంతగానో ప్రభావితం చేయుచున్నారు. కనుక మనము సేవకులకు కృతజ్ఞతలు తెలుపవలెను. వారు నిస్వార్థముగా సేవ చేస్తూనే మౌన ప్రచారకులుగా మారి అహ్మదియ్యత్ సందేశము కూడ అందిస్తారు. అల్లాహ్ తఆలా ఈ సేవకులందరి ఉత్సాహమును సదా పెంచుగాక! అల్లాహ్ తఆలా వారికి ఈ సేవకు బదులు గొప్ప ప్రతిఫలము నొసంగుగాక!

ఇలాగే ఎమ్.టి.ఏ. సేవకులున్నారు. ప్రపంచవ్యాప్త అహ్మదీయులు వీరికి కృతజ్ఞతలు తెలుపవలెను. అందరు కలిసి ఎంతో శ్రమపడి మూడు రోజులు సభా కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేసి చూపుటకు తగు ఏర్పాట్లు చేసినారు.

ప్రతి శాఖలోని సేవకులు తమ తమ శాఖలో చేసిన పనికి జమాఅత్ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలుపవలెను. అల్లాహ్ తమకు సేవ చేయు అనుగ్రహమిచ్చినందుకు సేవకులు కూడ కృతజ్ఞతలు తెలుపవలెను. మీరు కృతజ్ఞులు అయినచో మీ శక్తి సామర్థ్యములను, మీ ప్రతిభలను పెంచుతాను, నా మిగతా వరములను కూడ అందిస్తానని అల్లాహ్ తఆలా తెలిపెను. అల్లాహ్ తఆలా **లఅజీదన్నకుమ్** అన్నప్పుడు దేనిని పరిమితం చేయడు. అల్లాహ్ తఆలా బహుకరించినప్పుడు అనన్యముగా బహుకరించును, అన్ని రకాలుగా బహుకరించును. కనుక ప్రతి సఫలముపై, ప్రతి మంచి విషయముపై కృతజ్ఞత తెలుపటయే విశ్వాసుల పద్ధతి. లోపములను చూచినప్పుడు అల్లాహ్ తఆలాతో కరుణను కోరవలెను, క్షమాపణ యాచించవలెను.

హుజూర్ అయ్యదహుల్లాహు తఆలా ఇట్లనిరి. ఇప్పుడు నేను కొందరి అతిథుల అభిప్రాయాలను ప్రస్తావింతును. సీరియన్ అరబ్బులైన కొందరు అహ్మదీయుల అభిప్రాయాలను నేను మొదటగా తెలుపుతాను. ఒక అహ్మదీ మిత్రులైన అహ్మద్ దర్వేష్ గారిట్లనిరి. ఇది నా మొదటి సభ. నేను సభలో ప్రవేశించి వర్తమాన ఖలీఫాను చూడగానే నేను ఇస్లాంలో ప్రవేశించినట్లనిపించినది. నా జీవితములో అతి పెద్ద మార్పు వచ్చినదేమనగా నా నమాజు భక్తి, భయముతో నిండిపోయినది. కొన్ని రోజులకు మాత్రమే కాక శాశ్వతముగా సభలో పాల్గొన్న ప్రతి అహ్మదీలో రావలసిన మార్పు ఇది.

మరో సీరియన్ అహ్మదీ అయిన అల్‌హాజ్ అబ్దుల్లాహ్ గారిట్లనిరి. సభ యొక్క మూడు రోజులు ఎలా యున్నవనగా జీవితములో వాటిని మరచిపోలేను. ప్రపంచములోని ఉత్తమోత్తమ జమాఅత్ వేలాది అహ్మదీయులు కెనడాలో ఈ కాలపు మహా గొప్ప ఏర్పాట్లతో జరుగుచున్న సభలో ఏకమై యుండిరి. సభకు అన్ని ఏర్పాట్లు, స్వాగతము, ప్రతి వస్తువు పుష్కలంగా తుదకు పిల్లల ఆటలను కూడ గుర్తించి వివిధ ఏర్పాట్లు చేయడం అద్భుతమైన విషయము. సభా వాతావరణము ఆప్యాయత, సోదరభావములతో నిండియుండెను. వేలాది మందిని ఆహ్వానించడం, వారి ప్రయాణ, ఆహార ఏర్పాట్లు చేయడం వాస్తవానికి ఒక మహత్కార్యము. ఉపన్యాసములు, వాటి అనువాదము కూడ ఎంతో మంచిగుండెను. ఒక పత్రికా బృందము, మరొక ముస్లిం కుటుంబమును నేను ఆహ్వానించి యుంటిని. వారందరు సభా గొప్ప ఏర్పాట్లను చూచి ఆశ్చర్యపోయినారు. నా ముగింపు ఉపన్యాసమును వారు ఎంతో ఇష్టపడినారు. తమ ఇమామ్ పట్ల అహ్మదీయులలో గల ప్రేమ ఆయా అతిథులకు ఆశ్చర్యకరమైన విషయము.

ఇలాగే అబ్దుల్ ఖాదిర్ గారిట్లనిరి. సభకు ఎంత పెద్ద పని యుండునో నేను మొదటిసారి చూసినాను. ప్రతి సేవకుడు తన శాఖలో తేనెటీగ వలె అల్లరి, కష్టములను సృష్టించకుండానే పని చేయుచు పోవును. తనకు సేవ చేయు అవకాశమివ్వవలెనని ప్రతి ఒక్కరు కోరుచుండెను. నేను అరబ్బుడనని వారికి తెలియగానే నాతో వారు అసాధారణంగా వ్యవహరించేవారు.

సల్మా జమూలి గారైన మరొకరిట్లనిరి. సభా క్రమశిక్షణను, ఏర్పాట్లను చూచి ఒక శరీరము వలె ఏకమై, ఒకరు మరొకరికి సహాయము చేయుచుండిరని అనిపించెను. వివిధ దేశముల, విభిన్న జాతుల, వివిధ రంగుల ప్రజలు కలిసి ఒకే లక్ష్యము కొరకు అనగా ఇస్లాం, శాంతి సందేశమును ప్రపంచానికి అందించాలని పని చేయుచుండిరి.

క్రొత్త, పాత అహ్మదీయులైన కొందరి అభిప్రాయాలైన వీటిని నేనిప్పుడు తెలిపినాను. ఇతరుల అభిప్రాయములు కూడ గలవు. వాటిని నేనిప్పుడు తెలుపుతాను.

జర్మన్ కాన్సులేట్ ఇక్కడికి వచ్చి యుండెను. నా గురించి వారిట్లనిరి. ముగింపు ఉపన్యాసములో గొప్ప ఇస్లాంను ప్రస్తావించినారు. అది శాంతి, న్యాయము, ప్రేమానురాగమును బోధించును. ప్రతి పదములో ఒక వాస్తవము కనిపించుచుండెను. ప్రపంచ మీడియా ఇరాక్ వినాశనము, ఐసిస్ ప్రచారమునకు ఎంత సమయమిచ్చుచున్నదో అంత ఈ శాంతి దూతకు ఇచ్చినచో శాంతి ఏర్పడును కాబోలు. వారి ప్రతి వాక్యము సత్యముతో కూడినదై యుండెను. ప్రపంచ శాంతి స్థాపన కొరకు ఒక వ్యాకులత యుండెను. నాకు సాధ్యమైనంత వరకు నేను కూడ ఈ సందేశమును ముందుకు అందిస్తాను.

చర్చితో ముడిపడియున్న ఒక అతిథి ఇట్లనిరి. ఖలీఫతుల్ మసీహ్ తమ ఉపన్యాసములో శాంతి, సంధి గురించి మాట్లాడినందుకు నేడు నా హృదయము చాలా అనందపడినది. అహ్మదియ్య జమాఅత్‌ను గుర్తించడం ఇక తప్పనిసరి. అహ్మదియ్య జమాఅత్ చేయుచున్న పని ప్రజలకు తెలియవలెను. మీడియా ప్రజలకు చెప్పుచున్నవారు ముస్లిములు కాదు. ఇస్లాం నిజమైన బోధన చాలా శాంతియుతమైనది.

యు.కె.లో కూడ హాజరైన బేలీస్ నుండి వచ్చిన అక్కడి మేయర్ ఇట్లనిరి. ఖలీఫా ఉపన్యాసము వలన నాపై ఎంతో ప్రభావము పడెను. అంతర్జాతీయ సమస్యలను వర్తమాన ఖలీఫా ఎలా ప్రస్తావించినారనగా ఖలీఫా కేవలం అహ్మదీయులకు మార్గదర్శకులే కాక మొత్తం ప్రపంచానికి మార్గదర్శకులు కావచ్చునని నాకు తెలిసినది. ఖలీఫతుల్ మసీహ్ తమ ఉపన్యాసములో ప్రస్తావించిన విషయములను నేను జీవితములో మరచిపోలేను.

బ్రహ్‌మ్‌టన్ నుండి వచ్చిన ఒక అతిథి ఇట్లనిరి. సభలో శాంతిని స్థాపించుమను ఒకే సందేశము నాకు లభించినది.

నా ముగింపు ప్రసంగము విన్న మరో అతిథి ఇట్లనిరి. ఇది ఎంతో ఆశ్చర్యకరమైనది. నా భావాలను తెలుపుటకు నా వద్ద పదములు లేవు.

లోక్ సభ సభ్యురాలు అయిన మరొకరు యాస్మీన్ అతన్సీ గారిట్లనిరి. ఖలీఫా సందేశము, స్త్రీలతో చేసిన ప్రసంగము నాకు చాలా నిచ్చనది. ప్రత్యేకముగా ఒక తల్లి మొత్తం కుటుంబమునకు పునాదిగా యుండును, మొత్తం సమాజమును దృఢపరచునను విషయము చాలా బాగుండెను.

హుజూర్ అయ్యదహుల్లాహు తఆలా ఇట్లనిరి. వార్షిక సభకు పాల్గొన్నవారు కూడ అల్లాహ్ తఆలా కృపానుసారము మంచి అభిప్రాయము తీసుకొని పోవుదురు. ఏది ఏమైనప్పటికి వార్షిక సభ స్వపక్షము వారికి ఆధ్యాత్మిక మెరుగుతనము కొరకు ఏర్పాట్లు చేయగా ఇతరులకు కూడ జమాఅత్ పరిచయం, సంబంధములు ఏర్పాటగుటకు కారణమగుచున్నది. ఇస్లాం నిజమైన చిత్రము ప్రజలకు తెలియును. గత కొంత కాలము నుండి ముస్లిం దేశముల పరిస్థితులు, వాటి వలన ముందుకు వచ్చుచున్న ప్రపంచ స్థితి గతులు మీడియా దృష్టిని కూడ జమాఅత్ వైపు మరల్చినది. ఇది అల్లాహ్ తఆలా కృపయే. అతడే ఈ ప్రజల దృష్టిని ఇటువైపు త్రిప్పెను. ఎందుకంటే ఇంతకు ముందు చెప్పినా వారు ఇటువైపు వచ్చేది కాదు. ఇంకా మన నవయువకుల పాత్ర కూడ గొప్పగానే యున్నది. వారు మీడియాతో సంప్రదింపులు ఏర్పరచుకున్నారు. అల్లాహ్ తఆలా కృపానుసారము వారు పెద్ద

విస్తృత స్థాయిలో సంబంధములు ఏర్పరచుకున్నారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. పత్రికలు, రేడియో, టి.వి. చానళ్లవారు కొద్ది రోజుల క్రితము సభ మొదటి రోజు అనగా శుక్రవారము వచ్చియుండిరి. చిన్న కాన్ఫరెన్స్ కూడ జరిగెను లేదా వారు ఇంటర్వ్యూ తీసుకొనిరి. దానికి కూడ మంచి స్థలము కేటాయించిరి. జమాఅత్ పరిచయం పెరిగెను. ఇస్లాం నిజమైన బోధన తెలుపబడెను. వారికి నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశము అందించినాను. ప్రస్థుత పరిస్థితులపై మాట్లాడినను అహ్మదియ్య జమాఅత్ గురించి మాట్లాడినను ఇస్లాం వాస్తవము ప్రజలకు తెలిజేసేందుకు దానిని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీలు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆగమనముతో జోడించాలని నేను ఎల్లప్పుడు ప్రయత్నిస్తుంటాను.

సభకు మీడియా ఇచ్చిన ప్రచార సారాంశమేమనగా కనీస అంచనా వేసినా మొత్తమ్మీద పది మిలియన్ ప్రజలకు సభ వలన జమాఅత్ పరిచయం, సందేశము చేరినది. మీడియా మీద నేను చూచిన, వినిన మట్టుకు వారు చాలా నిజాయితితో వార్తలను ప్రచురించినారు. జమాఅత్ సమాచారము, జల్స వార్తలు, మన బోధన గురించి ప్రచురించినారు.

ఇది అల్లాహ్ తఆలా కార్యము. కనుక అతడే చేయుచున్నాడు. జమాఅత్ పరిచయం వ్యాపించుచున్నది. దీనితో పాటు మన ఆలోచనను ఇటు వైపు కూడ మరల్చును. మనము ఈ విషయముల వరకే ఆనందపడి యుండకుండా మన ఆధ్యాత్మిక స్థితిని, అల్లాహ్ తఆలాతో సంబంధమును పెంచుకోవలెను. అల్లాహ్ తఆలా దుష్టమైనదని చెప్పిన ప్రతి విషయము నుండి దూరముండుము. అల్లాహ్ తఆలా చేయాలని ఆదేశించిన ప్రతి విషయమును పాటించుము. ధార్మిక సేవకు అల్లాహ్ తఆలా అనుగ్రహించినచో దానిని దైవ శుభముగా భావించుము. పదవిదారులందరు, సేవకులు కూడ నిష్టాపరతను అవలంభించుచు తమ విధులను నిర్వర్తించుటకు కృషి చేయచవలెను. సభలో వినిన విషయములను మనము ఇప్పటి వరకు ఆచరించినామా ? జీవిత భాగములుగా చేసుకున్నామా ? అని సభలో పాల్గొన్నవారందరు ఆత్మ పరిశీలన చేసుకోవలెను. ఎలా మనము సత్కార్యములను సదా అవలంభించవలెను, ఇందుకు ఎలా కృషి చేయవలెనో కూడ పరిశీలించుకోవలెను.

ఈ విషయములను పాటించు అనుగ్రహము అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీకి కలిగించుగాక! వారు యదార్ధ రూపంలో అల్లాహ్ తఆలాను గుర్తించువారు, అతనితో సంబంధము ఏర్పరచుకొనువారగుదురు గాక! (ఆమీన్)

☆☆☆

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................